ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన ప్రారంభం



ప్రజా పాలన దరఖాస్తుల పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 6 గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి, రూ.500లకు గ్యాస్ సిలిండర్ పథకాల కింద లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన గురువారం చందానగర్ సర్కిల్ 21 పరిధిలో ప్రారంభం అయ్యిందని ఉపకమిషనర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందానగర్ సర్కిల్ పరిధిలో నాలుగు డివిజన్లు ఉండగా మాదాపూర్ డివిజన్‌లో 1495, మియాపూర్ డివిజన్‌లో 1674, హఫీజ్‌పేట్ డివిజన్‌లో 2341, చందానగర్ డివిజన్‌లో 1448 మొత్తం 6958 దరఖాస్తులు వచ్చాయన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి ప్రజాపాలన మొబైల్ యాప్‌లో పొందు పరిచే విధంగా యూసీడీ విభాగానికి చెందిన సిబ్బంది, బిల్ కలెక్టర్, ఎస్ఆర్‌పీ, ఎస్ఎఫ్ఏలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రజాపాలన దరఖాస్తులలో పొందు పరిచిన వివరాలను గ్యాస్ కనెక్షన్ నంబరును పరిశీలించి మొబైల్ యాప్‌లో పొందుపర్చాలన్నారు. ఈ దరఖాస్తులు శనివారం వరకు పరిశీలన పూర్తి అవుతుందని ఆయన తెలిపారు.

శిల్పారామంలో ముగిసిన మేళా



శిల్పారామంలో అలరించిన కూచిపూడి నృత్యాంశాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న నేషనల్ హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమాలలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కనకదుర్గ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. ఇందులో తనన, జయవారలక్ష్మి, శివపంచాక్షరీ, నర్తన గణపతిం,అర్ధనారీశ్వరం తదితర అంశాలను కళాకారులు మనస్విని, తేజస్వినీ, నిత్య, రిషిక, అనన్య, పర్ణిక, ధన్విక, అంజలి, అర్జున్, నాగరమ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్



పబ్ నిర్వాహకులతో సమావేశమై మాట్లాడుతున్న డీసీపీ డాక్టర్ వినీత్

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'డ్రగ్ ఫ్రీ తెలంగాణ, డ్రగ్ ఫ్రీ హైదరాబాద్' అనే నినాదానికి అందరూ సహకరించాలని మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ సూచించారు. ప్రభుత్వ ఆదేశాలు విధిగా అందరూ పాటించాలని ఒకవేళ డ్రగ్స్‌కు అనుమతి ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మాదాపూర్ జోన్ పరిధిలోని పబ్ నిర్వాహకులు, యజమాలనుతో ఆయన గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్‌లలో డ్రగ్స్‌కు అనుమతి ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి డ్రగ్స్‌కు అనుమతిస్తే ఎండీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పబ్‌లలో మైనర్లను అనుమతించరాదని సూచించారు. ప్రైవేటు పార్టీలకు అనుమతించే సమయంలో డ్రగ్స్ లేకుండా పార్టీలు జరిగేలా చూడాలని, అయినప్పటికీ డ్రగ్స్ వినియోగించినట్లు సమాచారం వస్తే వినియోగించినా, సరఫరా చేసిన వారిపై, పబ్‌లపై కూడా చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని హెచ్చరించారు. డ్రగ్స్ విషయంలో ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో మాదాపూర్ ఏడీసీపీ నర్సింహ్మారెడ్డి, ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు, పబ్‌లయజమానులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

డివిజన్‌కు నిధులు మంజూరు చేయండి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్‌లో డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరించేందుకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కోరారు. గురువారం హైదరాబాద్‌లో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డిని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. 113 డివిజన్ పరిధిలోని జేపీకాలనీ, శాంతినగర్, గౌతంనగర్ కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని ఈ వ్యవస్థ పునరుద్ధరించేందుకు రూ.1.15 కోట్లు కేటాయించాలని కోరారు.

తుది ఓటరు జాబితా విడుదల

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గం స్పెషల్ సమ్మరీ రివిజన్–2024 తుది ఓటరు జాబితాను తహసీల్దార్ భాస్కర్ గురువారం విడుదల చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో మొత్తం 4 ,07 419 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 2,09757, మహిళలు 1,97577, ట్రాన్స్‌జెండర్స్ 85 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్ అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం మాదారంలో నియోజిన్ కెమికల్స్ పరిశ్రమ యాజమాన్యం మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లను గురువారం అందించారు. ప్రత్యేకాధికారి మల్లేశ్, పరిశ్రమ ఎండీ శ్యాంసుందర్, డైరెక్టర్ నరేష్, ప్లాంటు మేనేజర్ చందు, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ మహిళలకు కుట్టుమిషన్‌లను అందజేశారు. మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి, తగిన సర్టిఫికెట్లను అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రత్యేకాధికారి మల్లేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: బఫర్ జోన్ ఆక్రమించి నిర్మాణాలు చేసిన ఇద్దరిపై అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నాగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్ పట్టణంలోని పెద్ద చెరువు బఫర్ జోన్ సర్వేనెంబర్ 185లో ఉన్న చెరువు శిఖం, బఫర్ జోన్ పరిధిలో బీవీ–ఇన్‌ఫ్ర ప్రతినిధి భానుప్రకాష్ ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్నారు. మరోవైపు, ఎస్ఆర్ సంస్థ ప్రతినిధి సంజీవరెడ్డి ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బహిరంగ ప్రదేశంలో చెత్త వేయొద్దు



చెత్తను బహిరంగ ప్రదేశంలో వేయవద్దని అవగాహన కల్పిస్తున్న అంజిరెడ్డి, కార్మికులు

మోతీనగర్: చెత్త, చెదారాన్ని ఎక్కడపడితే అక్కడ బహిరంగ ప్రదేశంలో పడవేయకుండా ఇంటి ముందుకొచ్చే స్వచ్ఛ ఆటో వారికి అందజేయాలని ఎంసీహెచ్ఎస్ మాజీ అధ్యక్షుడు నలమాల్పు అంజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మోతీనగర్ ప్రధాన వీధుల్లో జీహెచ్ఎంసీ సౌజన్యంతో ఎంసీహెచ్ఎస్ సహకారంతో పలు ప్రాంతాల్లో బ్యానర్లు ఏర్పాటు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని.. ప్లాస్టిక్ నిషేధం అంటూ బ్యానర్లపై రాశారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశంలో చెత్త వేయుట నిషేధమన్నారు. వేసిన వారిపై జరిమానాను జీహెచ్ఎంసీ అధికారులు విధిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటి ముందుకు వచ్చే స్వచ్ఛ ఆటో వారికి చెత్తను తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని సూచించారు. చేయిచేయి కలుపుదాం.. పర్యావరణాన్ని కాపాడుతూ ప్లాస్టిక్‌ని నిషేధిద్దాం అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ వై.నరేందర్, నాయకులు వెంకటస్వామి, చింటూరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో సౌకర్యాల లేమి





ఇజ్జత్‌నగర్ శ్మశాన వాటికలో విరిగిన కరెంట్‌పోల్, అడవిని తలపిస్తున్న చెట్లు, అస్తవ్యస్తంగా ఉన్న చెత్తాచెదారం

- అడవిని తలపిస్తున్న మరుభూమి
- మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు
- కనీసం కూర్చోడానికి కూడా ఎలాంటి వసతులు లేవు

మాదాపూర్: హైటెక్‌సిటీ ప్రాంతంలో ఉన్న శ్మశాన వాటికలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఐటీ ప్రాంతంగా పేరుగాంచిన మాదాపూర్‌లో ఉన్న స్మశాన వాటికలు వచ్చిన వారికి కనీస మౌళిక వసతులు కూడా లేకుండా పోయాయి. దాదాపు 6 ఎకరాలలో విస్తరించిన ఉన్న స్మశాన వాటికలో ఎలాంటి వసతులు లేకపోవడంతో కార్యక్రమాలు చేసుకునేందుకు వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దహనసంస్కరణలు చేసుకునేందుకు పూర్తి స్థాయిలో వసతులు లేకుండా పోయాయి.లక్షల రూపాయలను వెచ్చించి జీహెచ్ఎంసీ అభివృద్ధిపనులు చేపట్టినప్పటికి అవి నిరుపయోగంగా మారాయి.

- స్మశాన వాటికలో కూర్చోడానికి ఎలాంటి వసతులు లేవు.
- 6 ఎకరాలు మొత్తం అడవిని తలపించే విధంగా మారింది.
- ఆకతాయిలు వచ్చి మద్యం సేవిస్తున్నారు. అంతేకాక అసభ్య కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.
- వచ్చిన వారికి మూత్రశాలలు, స్నానగదులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.
- నీటి వసతి కూడా లేదు.
- ఎక్కడి కక్కడ స్తంబాలు విరిగిపోయాయి. కరెంట్‌వైర్లు ప్రమాదకరంగా మారాయి.
- సరైన గేటు లేకపోవడంతో వ్యర్థాలను అక్కడే డంపింగ్ చేస్తున్నారు.
- అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.



అర్ధరాత్రి బైక్ స్టంట్లు.. ఆరుగురి అరెస్ట్

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో అర్ధరాత్రి బైక్‌లతో స్టంట్లు చేస్తున్న ఆరుగురు యువకులను రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. నాలెడ్జి సిటీలోని టీ హబ్ రోడ్డులో గురువారం తెల్లవారు జామున 2 గంటలకు బైక్‌లతో స్టంట్లు చేస్తున్నట్లు సమాచారం అందించింది. ఎస్ఓటీ పోలీసులు లంగర్‌హౌజ్‌కు చెందిన షేక్ సల్మాన్(21), అఫ్రోజ్‌ఖాన్(20), మహ్మద్ సోహెల్(20), ఇమ్రాన్ ఖాన్, మీర్ షోహెల్(20) ఎండి ఇమ్రాన్ ఖాన్(21)లను అదుపులోకి తీసుకొని రాయదుర్గం పోలీసులకు అప్పగించారు. నిందితుల నుంచి ఒక పల్సర్, ఒక బుల్లెట్, రెండు యాక్టివాలను స్వాధీనం చేసుకున్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

గచ్చిబౌలి: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జేమ్స్ బాబు తెలిపిన మేరకు.. అనారోగ్యంతో బాధపడుతూ గుర్తు తెలియని వ్యక్తి(65) కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఆస్పత్రి డాక్టర్లు గచ్చిబౌలి పీఎస్‌కు సమాచారం అందించారు.

హోంగార్డు శివకామిని మృతి



శివకామిని (ఫైల్)

మియాపూర్ : మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు శివకామిని (56) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందింది. శివకామిని బీహెచ్ఇఎల్‌లోని పోలీస్ క్వార్టర్స్‌లో నివాసముంటోంది. కొంతకాలం నుండి అనారోగ్యంతో బాధపడుతున్న శివకామిని బుధవారం రాత్రి తన నివాసంలోమృతి చెందింది. శివకామిని గత 35 ఏళ్లుగా హోంగార్డుగా విధులు నిర్వహిస్తోంది.

గుండెపోటుతో సీఆర్‌పీఎఫ్ ఎస్ఐ మృతి

మియాపూర్: గుండెపోటుతో సీఆర్‌పీఎఫ్ జవాన్ ఎస్ఐ మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. తమిళనాడు వేలూరుకు చెందిన పీఎస్ పరన్‌తామన్ (56) గత కొన్ని సంవత్సరాలుగా మియాపూర్‌లోని నడిగడ్డతాండ వద్ద సీఆర్‌పీఎఫ్ క్యాంపులో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం పరన్‌తామన్‌కు గుండెపోటు రావడంతో కిందపడిపోయాడు. దీంతో అక్కడి సిబ్బంది దగ్గరలో ఉన్న మెడికేర్ ఆస్పత్రికి తరలించగా రాత్రి 11.30 గంటల సమయంలో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు సీఆర్‌పీఎఫ్ జవాన్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ఆల్విన్‌కాలనీ: ఎన్‌టీఆర్‌నగర్‌లోని శ్రీషిర్డి సాయి బాబా దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం హారతి, రుద్రాభిషేకం , మధ్యాహ్న హారతి, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆయన చేతుల మీదుగా ఆలయ నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు.



వీకర్‌సెక్షన్ కాలనీ సమస్యలను పరిష్కరిస్తా



ఎమ్మెల్యే గాంధీని కలిసిన వీకర్‌సెక్షన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ వీకర్‌సెక్షన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నుకోబడిన కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే గాంధీ నూతన కార్యవర్గ సభ్యులను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ నాయకులు కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కాలనీ అభివృద్ధికి తన వంతు సహాక సహకారాలు అందజేస్తానని తెలిపారు. ఏ చిన్న సమస్య వచ్చినా కార్పొరేటర్ దృష్టికి లేదా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరు సమష్టిగా కలిసి కాలనీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఒక ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దే క్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వీకర్‌సెక్షన్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడ కె.కొండల్‌రావు, ఉపాధ్యక్షుడు కె.నాగార్జునాచారి, రాజశేఖర్, కార్యదర్శులు వినయ్, పోతురాజు, కోశాధికారి బాలలింగం, మునేశ్వర్ రావు, వెంకటేశ్వర్లు, కిషన్, గోపీనాథ్ సూరి, ప్రకాష్,వెంకటేష్,ఉషారాని,లతీఫ్ పాల్గొన్నారు.

అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కైదమ్మకుంట చెరువు వద్ద ఉన్న కట్ట మైసమ్మ దేవాలయంలో గురువారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీకి దేవాలయ కమిటి సభ్యులు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై జెడ్‌సీతో సమీక్ష

భాగ్యనగర్‌కాలనీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశంలో ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపడతామని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆయన కూకట్‌పల్లి జెడ్‌సీ అభిలాష అభినవ్‌ను కలిసి నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని హైదర్‌నగర్, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లిలోని కొన్ని ప్రాంతాల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని జెడ్‌సీని కోరామని తెలిపారు. శేరిలింగంపల్లి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యకరమంలో మాజీ కార్పొరేటర్ భానుప్రసాద్, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కూన సత్యంగౌడ్, నల్ల సంజీవరెడ్డి, నాగేశ్వరరావు, సిందం శ్రీకాంత్, విద్యాకల్పన ఏకాంత్‌గౌడ్, నాగమణి యాదగిరి, మారెళ్ల శ్రీనివాసరావు, బసంత్ రాజ్, శిరీష సత్తూర్ తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి జెడ్‌సీ అభిలాష అభినవ్‌తో జరిగిన సమీక్ష సమావేశంలో జగదీశ్వర్‌గౌడ్

నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



ఆల్విన్‌కాలనీ: ఎన్‌టీఆర్ నగర్ నుంచి పీజేఆర్‌నగర్‌కు వెళ్లే సీసీ రోడ్డు కోసం గతంలో మంజూరై, ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న పనులను గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వర్షపు నీరు నిల్వకుండా లెవెలింగ్ ప్రకారం నిర్మాణం చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, గుడ్ల శ్రీనివాస్, సీహెచ్.భాస్కర్, పోశెట్టిగౌడ్, మహేష్, మహబూబ్, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు సమగ్రంగా నమోదు చేయాలి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని అధికారులు సూచించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా గ్యాస్ వినియోగదారులు నెంబర్‌ను సరిగా దరఖాస్తులో రాయకపోవడంతో ఇబ్బందులు ఉన్నట్లు గ్రహించారు. దీంతో సర్కిల్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఏఎంసీ నరేందర్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీస్ మల్లీశ్వరీలు మాట్లాడుతూ మూడు రోజుల్లో గ్యాస్ వినియోగదారుల వివరాలను యాప్ ద్వారా, ఆయా గ్యాస్ ఏజన్సీల పేర్లు కూడా నమోదు చేయాలని సూచించారు. ఇప్పటికే సర్కిల్ పరిధిలో సుమారు 6 వేల దరఖాస్తులకు సంబంధించిన గ్యాస్ నెంబర్ వివరాలు సరిగా లేవని, వాటిని ఫోన్ ద్వారా గాని, నేరు వెళ్ళిగాని సేకరించాలన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో మహిళలకు నైపుణ్య శిక్షణ

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర రెడ్డి రీసర్చ్ సెంటర్‌లో ఉచితంగా మహిళలకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్‌కు సంబంధించిన పరిజ్ఞానం, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణలు ఉచితంగా అందిస్తున్నారు. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, ఒకోక్క బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాల మధ్యలో గల చిన్నారులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. వివరాలకు 9603196925 నెంబరుకు ఫోన్‌చేయవచ్చు.

శివసాయిక్షేత్రంలో రుద్రాభిషేకం



ప్రత్యేక పూజలందుకుంటున్న అమ్మవారు

రాయదుర్గం: మాసశివరాత్రిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో గురువారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం ఆలయంలో కాశీ విశ్వేశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని ప్రత్యేకంగా అర్చకుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని అన్నపూర్ణాదేవికి, గణేషుడికి, షిర్డీసాయిబాబాకు, ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలుచేసి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

చందానగర్ డివిజన్ అభివృద్ధికి కృషి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని డిఫెన్స్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానికులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిఫెన్స్ కాలనీలో సుమారు రూ.25 లక్షల నిధులతో సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వరలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో 7.47 లక్షల ఓటర్లు



జాబితాను నోటీసు బోర్డులో ఏర్పాటు చేస్తున్న అధికారులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 7,47,671 ఓటర్లతో తుది జాబితాను విడుదల చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ రజనీ కాంత్‌రెడ్డి తుది ఓటరు జాబితాను నోటీసు బోర్డులో ఏర్పాటు చేశారు. అదే విధంగా శేరిలింగంపల్లి తహశీల్దార్ ఆఫీస్, చందానగర్ సర్కిల్ కార్యాలయాల్లో కూడా జాబితాను ఏర్పాటు చేసినట్లు డిప్యూటి కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పురుష ఓటర్లు 3,95,460, మహిళా ఓటర్లు 3,52,067, ఇతర ఓటర్లు 144 మంది ఉన్నట్లు వెల్లడించారు.

చెరువులో అక్రమ నిర్మాణాల తొలగింపు



హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం పెద్ద చెరువులో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. ఇటీవల కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి గంగారం పెద్ద చెరువులో ఆక్రమణను తొలగించాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. విజిలెన్స్, రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది కఠినంగా వ్యవహరించి చెరువులోని అక్రమణ నిర్మాణాలను పూర్తిగా తొలగించాలన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

మాదాపూర్: నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. గురువారం మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీ కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలసి పర్యటించి,సమస్యలను అడిగితెలుసుకున్నారు. స్థానికులు జయచందర్ రెడ్డి, సతీష్, రామకృష్ణ కుమార్, బల్వంత్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వరరావు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహశబరిష్‌కు కార్పొరేటర్ పుష్పనగేష్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పట్టణంలోని శ్మశానవాటికలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తిచేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.